సాక్షి
ములుగు

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



వేతనం రికవరీ చేయాల్సిందే!
విధులకు గైర్హాజరు అయిన యూనియన్ నేత జీతం రికవరీ చేయాలని టీజీఎన్పీడీ సీఎల్ యాజమాన్యం నిర్ణయించింది.
- 8లో ▸



రైతులకు అండగా ఉంటాం..
అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37^0/23^0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కామేశ్వరాలయ పునాది మట్టి తొలగింపు



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయం పక్కన ఉన్న కామేశ్వరాలయ పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. కామేశ్వరాలయాన్ని పునర్నిర్మించేందుకు ఆలయ ప్రదేశంలో ఉన్న మట్టిని జేసీబీ, ట్రాక్టర్లతో తొలగిస్తున్నారు. సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రకారం ఆలయం అడుగుభాగాన పోసే ఇసుక కొట్టుకుపోకుండా ఆలయం చుట్టూ రెండు మీటర్ల లోతు నుంచి రాయితో గోడను నిర్మించారు. ఆలయం అడుగుభాగంలో ఉన్న లూజ్ మట్టిని తొలగించి లెవలింగ్ పనులు చేస్తున్నారు. మట్టి తొలగించిన అనంతరం ఆలయ అడుగుభాగంలో పెద్ద రాళ్లను పేర్చి ఇసుకతో నింపనున్నారు. సాండ్ బాక్స్ టెక్నాలజీ ద్వారానే కామేశ్వరాలయాన్ని పునరుద్ధరించేందుకు పురావస్తుశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సన్నబియ్యం పంపిణీ వేగవంతం చేయాలి



ములుగు: సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ దివాకర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 222రేషన్ దుకాణాలు ఉన్నాయని అన్నారు. 91,563 రేషన్ కార్డులు ఉండగా 2,57,841 మంది లబ్ధిదారులకు 1702.096 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం రాంపతి, జిల్లా అధికారి ఫైజల్ హుస్సేని, అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి శ్రీరామనవమి వేడుకలు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలోని శ్రీసీతారామ చంద్రస్వామివార్ల ఆలయంలో శనివారం నుంచి సోమవారం వరకు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల (నేడు) 5న శనివారం సాయంత్రం 4గంటలకు అధ్యాయనోత్సవం, ప్రబంధ పారాయణం, రాత్రి 8గంటలకు ఎదురుకోలు సేవ కార్యక్రమం నిర్వహిస్తారు. 6న ఆదివారం ఉదయం 10.31గంటలకు రామాలయం కల్యాణ మండపం వద్ద ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు హవనం, బలిహరణం జరిపిస్తారు. 7న సోమవారం ఉదయం 11గంటలకు పూర్ణహుతి, సాయంత్రం 5గంటలకు శ్రీపుష్ప యాగం, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు తరలి రానున్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి

భూపాలపల్లి అర్బన్: విద్యా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వశిక్ష జిల్లా మానిటరింగ్ అధికారి కాగితపు లక్ష్మణ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు పదోన్నతి పొందిన బయాలజీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఆయా పాఠశాలల్లో తరగతి గదిలో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. జీవశాస్త్రపు ఉపాధ్యాయులు విద్యా సామర్థ్యాల ఆధారంగా బోధన చేసి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. ఆశించిన ఫలితాలను రాబట్టాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌లు డాక్టర్ మార్క వీణావాణి, కుర్రి శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాల ప్రకారం విద్యార్థులకు బోధన చేసి విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంపొందించాలన్నారు. ప్రయోగాత్మక పద్ధతి, కృత్యాధార బోధనల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సారంగపాణి, జ్యోతి, సరిత పాల్గొన్నారు.

ఆహ్లాదం లేదు..

- పర్యాటక జిల్లాలో అందుబాటులో లేని పార్కులు
- జిల్లాకేంద్రంలో సైతం పార్కు లేని వైనం

సాక్షి పరిశీలన

ములుగు: పర్యాటక ఖిల్లాగా ప్రత్యేక గుర్తింపు పొందిన జిల్లాలోని రామప్ప, లక్నవరం, మేడారం, మల్లూరు హేమాచలక్షేత్రం, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో ఏడాది పొడవునా పర్యాటకులు ఆయా ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తుంటారు. పర్యాటకులు జిల్లాకు వచ్చే క్రమంలో, తిరుగు ప్రయాణంలో సేద దీరడానికి ప్రత్యేకంగా పార్కులు లేకపోవడం లోటుగా మారింది. దీంతో పాటు ప్రస్తుతం 10వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో తల్లిదండ్రులతో కలిసి ఆహ్లాదకరంగా గడపడానికి సరైన ప్రదేశం లేకుండా పోయింది.



గ్రామపంచాయతీ మీటింగ్‌హాల్ ఎదుట ఉన్న మినీ పార్కు

ఒత్తిడిని తట్టుకోవడానికి..

సాధారణంగా ప్రజలు ప్రస్తుత జీవన విధానానికి అనుగుణంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకోవడానికి ఉదయం సాయంత్రం వాకింగ్ చేయడం పరిపాటిగా మారింది. వయస్సుతో సంబంధం లేకుండా ఉబకాయం ఉన్న చిన్నారులతో పాటు వృద్ధుల వరకు వైద్యుల సూచనల మేరకు చెమటోడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి అనుకూలమైన ప్లాట్ ఫాం లేకపోవడంతో బండారుపల్లి రోడ్డులోని తంగేడు స్టేడియం ప్రత్యామ్నాయంగా వినియోగించుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో ఉన్న పాత అంగడి ప్రాంతంలో గ్రామపంచాయతీ ప్రదేశంలో ఏర్పాటు చేసిన మినీ పార్కు వాకింగ్‌కు అనుకూలంగా లేదు. స్థలం ఎక్కువగా లేకపోవడంతో ఉన్న ప్రదేశంలో చెట్లు, గ్రీనరీ పెంచడం వంటి పనులు చేశారు, చూడడానికి పచ్చని అందాలు ఉన్నా పూర్తి స్థాయి వినియోగంలో లేదు. ఇదిలాఉండగా బండారుపల్లి రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట స్థానిక ప్రజల అవసరానికి అనుగుణంగా ఎక్సర్‌సైజ్ చేసుకోవడానికి కొన్ని రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. స్థానికులు ఉదయం, సాయంత్రం వీటిని వినియోగిస్తూ వ్యాయామం చేస్తున్నారు.



మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన వ్యాయామ పరికరాలు

జిల్లాకేంద్రంలో పార్కు ఉంటే బాగుంటుంది

జిల్లాకేంద్రంలో ఆహ్లాదంగా సేదతీరడానికి పార్కు ఉంటే బాగుంటుంది. ప్రస్తుతం పిల్లల చదువులు దగ్గరపడ్డాయి. మరో 20 రోజుల్లో వేసవి సెలవులు ఇస్తారు. ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలో గడపడానికి ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అధికార యంత్రాంగం ములుగు చుట్టు పక్కల ఓ పార్కును ఏర్పాటు చేయాలి.

- కందికొండ అనిత-కుమారస్వామి, ములుగు

సౌకర్యాలు కల్పించాలి..



ములుగు జిల్లా అంటేనే పర్యాటక ప్రాంతాలకు గుర్తింపు తెచ్చిన జిల్లా. సెలవు దినాల్లో రాష్ట్రంలోని నలుమూలల నుంచి వందలాది మంది తరలివచ్చి జిల్లా పర్యాటక అందాలను తిలకిస్తారు. పర్యాటకులు ఉదయం వచ్చే సమయంలో, తిరుగు ప్రయాణంలో సేదదీరడానికి ప్రత్యేకంగా పార్కులు లేకపోవడం బాధాకరం, ఇప్పటికైనా జిల్లాకేంద్రంలో పార్కును ఏర్పాటు చేసి స్థానిక ప్రజలతో పాటు, పర్యాటకులకు అందుబాటులో ఉంచాలి.

- కొత్త సురేందర్, ములుగు

ఇప్పపువ్వు సేకరణపై అవగాహన

వెంకటాపురం(ఎం): ఇప్పపువ్వు సేకరణపై మండలంలోని బండ్లపహాడ్, ఊట్ల గొత్తికోయ గ్రామాల్లో గిరిజనులకు అటవీశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ములుగు ఎఫ్ఆర్ఓ శంకర్ మాట్లాడుతూ.. ఇప్పపూవ్వు సేకరణ సమయంలో ఇప్పచెట్ల కింద క్లీనింగ్ కోసం నిప్పు పెట్టవద్దని, గ్రీన్ షాడో నెట్లను ఉపయోగించాలన్నారు. ఇప్పచెట్ల కింద ఉన్న చెత్తను తొలగించేందుకు నిప్పు పెట్టడం వల్ల మంటలు వ్యాపించి ఇతర చెట్లు కాలిపోయే ప్రమాదముంటుందన్నారు. ఇప్పచెట్ల కింద చెత్తను తొలగించి గ్రీన్‌నెట్లను వాడుతున్నవారికి అటవీశాఖ తరపున బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ యాకూబ్ జానీ, ఎఫ్ఎస్ఓ రాజేశ్వరి, ఎఫ్‌బీఓలు రజిత, స్వర్ణలత, రూప్‌కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న ఎఫ్ఆర్ఓ శంకర్

అకాల వర్షంతో ఆందోళన



కల్లంలో ఆరబెట్టిన మిర్చి



మిర్చి తడవకుండా కవర్లు కప్పిన రైతులు

మంగపేట: అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలో శుక్రవారం సాయంత్రం గాలులతో భారీ వర్షం పడింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ గాలులతో గంటన్నర పాటు భారీ వర్షం దంచి కొట్టింది. అయినప్పటికీ వాతావరణ శాఖ రెండు రోజుల ముందు నుంచే అకాల వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించడంతో రైతులు ముందస్తుగా తగిన జాగ్రతలు పాటించడంతో పెద్దగా ఎక్కడ కూడా నష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. మిర్చి కల్లాల్లో ఉన్నప్పటికీ రైతులు వర్షానికి తడవకుండా కవర్లు కప్పి ఉంచడంతో నష్టం జరుగలేదు. ఆడ మగ వరి సాగు చేసిన రైతులకు కొంతమేర నష్టం కలిగించిందని రైతులు తెలిపారు.

బాలాలయంలోకి నరసింహస్వామి

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా ఉదయం విశ్వాక్ సేవ పూజ, పుణ్యవచనం, హోమం, పూర్ణహూతి అనంతరం స్వామి వారిని బాలాలయంలోకి ప్రవేశించారు. అనంతరం మూర్తిచండ, ప్రచండ దేవతలు జయ, విజయలు, శిఖరం, ధ్వజస్తంభం, రాజగోపురం, శ్రీ ఆంజనేయ స్వామి, గరుడ ఆల్వార్ ఉద్వాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ భిక్షపతి, ఎండోమెంట్ డీఈ రమేష్, ఆలయ ధర్మకర్తలు సుదర్శన్ జోగయ్య, మల్లయ్య, ఐలయ్య పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్థిక సంక్షోభం ఉన్నా పథకాల అమలు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: బీఆర్ఎస్ ప్రభుత్వం కారణంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో శుక్రవారం సన్న బియ్యం ఉచిత పంపిణీ పథకాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కడుపునింపడం కోసం ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం ప్రాధాన్యత తక్కువ ఉన్న దొడ్డు బియ్యం పంపిణీ చేసిందని తెలిపారు. దీని ఫలితంగా రీసైక్లింగ్ జరిగి కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. సన్నబియ్యం వినియోగం పెంచి దొడ్డు బియ్యం రీసైక్లింగ్‌ను అరికట్టడానికి రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వంలో రేషన్ డీలర్లు భాగస్వాములని ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని పేర్కొన్నారు. పైరవీలకు తావులేకుండా నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్ఓ శ్రీనాథ్, డీఎం రాములు, డీఆర్డీఓ నరేశ్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ, కాటారం సబ్ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

మంత్రి సీతక్క

ములుగు: ప్రభుత్వవైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించేలా సేవలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రి సమీక్ష సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి శుక్రవారం వైద్యులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలు రకాల వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించి భరోసా ఇవ్వాలని అన్నారు. రోగులతో ప్రేమగా మాట్లాడుతూ సానుకూలంగా స్పందించాలని అన్నారు. ప్రభుత్వ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని అన్నారు. ములుగు, ఏటూరునాగారం ఆస్పత్రుల్లో వైద్యులు 24గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వైద్య సిబ్బంది జవాబుదారీతనంగా ఉండాలని చెప్పారు. ప్రతి మండలంలో 108 వాహనం ఉండేలా చూసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించుకొని పరిస్థితిని తెలుసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, వైద్యులు పాల్గొన్నారు.



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీతక్క

పలువురికి మంత్రి పరామర్శ

గోవిందరావుపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను, వారి కుటుంబాలను మంత్రి సీతక్క శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని అమ్మ తండా గ్రామంలో కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న బానోత్ సమ్మయ్య, ఇటీవల మరణించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొద్దుల గూడెం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మారెడ్డి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, నాయకులు ఉన్నారు.



ఉపాధి హామీ కూలీలను పెంచాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: ఉపాధి హామీ పనులకు కూలీలను పెంచాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఎంపీడీఓలను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం పనులు, సెర్ప్ కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై శుక్రవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఓ, గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ మండల ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఉన్నామని ఉపాధి హామీ పథకం పనులు పెద్దఎత్తున చేపట్టేందుకు కూలీలను మొబలైజ్ చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. మూడు నెలలు అత్యంత కీలకమని.. మూడు నెలల్లో 80 రోజుల పని దినాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలి రేటు రూ.300 నుంచి రూ.307లకు పెంచినట్లు తెలిపారు. డిమాండ్‌కు తగినట్లు పనులు జరిగేలా కార్యాచరణ తయారు చేయాలన్నారు. మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో 5వేల మంది రైతుల భూముల్లో వెదురు పెంపకం చేపట్టేందుకు ఈ నెల 15వ తేదీ వరకు రైతులను ఎంపిక చేయాలన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు 50 శాతం మహిళా సంఘాలకు కేటాయించాలని, మహిళా సంఘాల జాబితా తయారు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఎంపిక చేసిన సంఘాలకు శిక్షణ ఇవ్వాలన్నారు. చేయూత (వృద్ధాప్య పింఛను) పొందుతున్న వ్యక్తి భర్త లేదా భార్య మరణిస్తే వారిలో జీవించి ఉన్న ఒకరికి పింఛను మంజూరు చేసేందుకు మున్సిపల్, మండల స్థాయిలో విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. భూపాలపల్లి, కాటారం డివిజన్‌లో మహిళా స్వయం సహాయ సంఘాలకు పెట్రోల్ బంకులు ఏర్పాటుకు భూమి కేటాయింపు చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో 559 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించేందుకు ఈ నెల 11వ తేదీ వరకు అన్ని బిల్లులు అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాటారం డివిజన్‌లో మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నివేదిక అందజేయాలన్నారు. మంజూరైన ఇండ్ల పనులు చేపట్టేందుకు తక్షణమే మార్కింగ్ చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా మంజూరైన ఇండ్లు ప్రగతి వివరాలను ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఆర్‌డీఓ నరేష్, పరిశ్రమల శాఖ అధికారి సిద్ధార్థ, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, ఆర్డీఓ రవి అన్ని మండలాల ప్రత్యేక అధికారులు ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణపై కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పరిశ్రమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ పథకానికి 4,479 దరఖాస్తులు వచ్చాయని, ప్రజలకు తెలిసేలా గ్రామ, గ్రామాన విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు.

రజతోత్సవ మహాసభకు తరలిరావాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు: ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు జిల్లా నుంచి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, రజతోత్సవసభ ములుగు ఇన్‌చార్జి పెద్ది సుదర్శన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశానికి పెద్ది ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని 10 మండలాల్లో భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కంకణబద్దులు కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయి నుంచి ఎండగట్టే ప్రయత్నం చేయాలని చెప్పారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో ములుగు గడ్డపై గులాబీజెండా ఎగరడం ఖాయమని చెప్పారు. రైతులకు బోనస్ పేరుతో మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, నాయకులు భూక్య జంపన్న, గండ్రకోట సుధీర్, విజయ్‌రాంనాయక్, పాలెపు శ్రీనివాస్, కోగిల మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

రెండో రోజు పాదయాత్ర

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో 12, 13 వార్డుల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పేరిట రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా దేవన్ మాట్లాడారు. బీజేపీ నాయకులు మహాత్మా గాంధీని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అవహేళనగా మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పం కిషన్, పిప్పాల రాజేందర్, స్వామి, రవీందర్, అశోక్, పాల్గొన్నారు.



క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్ఎల్బీ 5 ఏళ్ల లా కోర్సులో తాత్కాలిక పద్ధతిన వివిధ సబ్జెక్టుల్లో టీచింగ్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోషియాలజీ (1), పొలిటికల్ సైన్స్(1), లా సబ్జెక్టుల్లో బోధనకు(ఆరు) వేకన్సీలు ఉన్నట్లు తెలిపారు. ఎల్ఎల్ఎం, /ఎంఏ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. నెట్/సెట్ పాస్ లేదా పీహెచ్డీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ లా కాలేజీలో ఈనెల 8వ తేదీ వరకు అందజేయాలని పేర్కొన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు టీచింగ్ అనుభవం సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇది పార్ట్టైం నియామకం కాదని, వన్టైం సింగిల్ అరెంజ్మెంటుగా తాత్కాలిక పద్ధతిలో(2024–25)విద్యాసంవత్సరానికే (సెమిస్టర్) నియామకని పేర్కొన్నారు. ఒక సబ్జెక్టులో పేపర్వైజ్ ఐదు యూనిట్స్ సిలబస్ బోధిస్తే రెమ్యూనరేషన్ రూ.20వేలు చెల్లిస్తారని సుదర్శన్ తెలిపారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్పై టాస్క్ఫోర్స్ దాడులు

- ఒకరి అరెస్టు, ఇద్దరు పరార్
- రూ.10,500, సెల్ఫోన్ స్వాధీనం

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో ఐపీఎల్ టీ–20 మ్యాచ్లపై బెట్టింగ్ చేస్తున్న వారిపై టాస్క్ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి దాడులు జరిపారు. గీసుకొండకు చెందిన యాదగిరి గిరిధర్, దొడు నితిన్, వంచనగిరికి చెందిన కావటి రాకేశ్ ఐపీఎల్ మ్యాచ్లో జట్ల గెలుపోటములు, బ్యాటింగ్, బౌలింగ్ చేసే వారిపై బెట్టింగ్ పెడుతున్న సమాచారాన్ని విశ్వసనీయంగా తెలుసుకుని వారిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో దొడు నితిన్, కావటి రాకేశ్ పరారు కాగా.. యాదగిరి గిరిధర్ను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ రంజిత్కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,500, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్ఫోర్స్ ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గురుకుల విద్యాలయ జూనియర్ కళాశాలల్లో 2025–26లో ప్రవేశాలకు టీజీఆర్జేసీ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని టీజీఆర్జేసీ హసన్పర్తి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ఇందుమతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈఏడాది మార్చి–ఏప్రిల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు http:tgrjc.cgg.govt. inలో చూడాలని తెలిపారు. ఇతర వివరాలకు 040–2473 4899, 98665 59727 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

వేతనం రికవరీ చేయాల్సిందే!

- విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులకు ఝలక్
- ఆదిలాబాద్ జిల్లాలో ఓ యూనియన్ నేత, జీతం చెల్లించిన డీఈ జీతం రికవరీ
- మెమో జారీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ఇప్పటికైనా నాయకుల్లో మార్పు వచ్చేనా?

విధులకు గైర్హాజరైన యూనియన్ నేత జీతం రికవరీకి ఎన్పీడీసీఎల్ నిర్ణయం



హన్మకొండ : టీజీఎన్పీడీసీఎల్లో ఓ ఉద్యోగ సంఘం నాయకుడు విధుల హాజరు నుంచి పూర్తి స్థాయి మినహాయింపు లేకున్నా.. విధులకు హాజరు కాకున్నా పూర్తి స్థాయి వేతనం పొందాడు. అలాగే, సదరు సంఘ నాయకుడు విధులకు గైర్హాజరైనా ఓ డీఈ.. జీతం ఇచ్చాడు. దీనిపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి నివేదిక అందించారు. దీనిని పరిశీలించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి జీతం రికవరీ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకుల్లో కలకలం సృష్టించింది. ఝలక్ ఇచ్చింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ నాయకుడు ఎలాంటి ఫుల్ టైమ్ అనుమతి లేకుండా విధులకు హాజరు కాలేదని, అయినా అతడికి వేతనం చెల్లించడంతో సంస్థకు ఆర్థిక నష్టం చేకూరిందని పేర్కొంటూ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జీతం మొత్తం రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హెచ్ఆర్డీ విభాగం మార్చి 22, 2025 తేదీతో మెమో జారీ చేసింది.

2023లోనే రద్దయిన విధుల నుంచి మినహాయింపు..

విద్యుత్ శాఖలో యూనియన్కు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తికి ఆ యూనియన్ కార్యకలాపాల నిమిత్తం సమావేశాలకు హాజరయ్యేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయి మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ అటూ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్ సంస్థలు ఫుల్టైమ్ అనుమతి ఇచ్చేవి. ఈ విధానం 2022 డిసెంబర్ వరకు కొనసాగింది. 2023 సంవత్సరం నుంచి రద్దు చేశారు. 2022 వరకు రాష్ట్ర, కంపెనీ, జిల్లా స్థాయి ముఖ్య నాయకులకు ఫుల్టైమ్ అనుమతి ఉండేది. అయితే 2022 డిసెంబర్ 16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ సమావేశంలో నాలుగు విద్యుత్ సంస్థలు జెన్కో, ట్రాన్స్ కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదేని కంపెనీ నుంచైనా యూనియన్కు ఒక్కరు మాత్రమే ఫుల్ టైమ్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించాయి. దీంతో రాష్ట్ర, కంపెనీ, సర్కిల్ వారీగా గతంలో తీసుకున్న ఫుల్టైమ్ విధానం రద్దయింది. ఈ ఒక్కరిలో కూడా వర్క్మెన్ క్యాడర్కు సంబంధించిన ఉద్యోగి అయి ఉండాలని నిబంధన పెట్టారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్లో జేఎల్ఎం నుంచి ఫోర్మెన్ వరకు, ప్రొవెన్షియల్ విభాగంలో అటెండర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వర్క్మెన్ క్యాడర్లోకి వస్తారు. అయితే పలు యూనియన్లకు వర్క్మెన్ పై స్థాయి క్యాడర్ కలిగి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాష్ట్ర స్థాయిలో కీలక పదవుల్లో ఉన్నారు. వీరితో పాటు సర్కిల్ స్థాయిలో పలువురు యూనియన్ల నాయకులు 2022 వరకు ఫుల్టైమ్ అనుమతి పొందారు.

యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు..

ఈ నిర్ణయం విద్యుత్ యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫుల్టైమ్ విధానంలో మార్పులు చేర్పులు జరగకముందే గైర్హాజర్పై తీవ్రంగా స్పందించిన యాజమాన్యం ఇక ముందు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆందోళనలో యూనియన్ నాయకులున్నారు.

పాత అలవాటు ఇప్పటికీ కొనసాగింపు..

ఫుల్టైమ్లో నియంత్రణ విధించడంతో పాత అలవాటు ఇప్పటికీ కొందరు నాయకులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో యూనియన్ నాయకుల హాజరుపై ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం అప్పుడప్పుడు విచారణ చేపడుతోంది. కంపెనీ, సర్కిల్ స్థాయికి చెందిన యూనియన్ నాయకులు కొందరు ఇప్పటికీ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆదిలాబాద్ సర్కిల్లో జేఏఓ పి.గోపాల్ రావు 2019లో ఫుల్టైమ్ మినహాయింపు పొందాడు. అయితే ఆ తర్వాత కూడా 2020 జనవరి 1 నుంచి జూలై 30, 2021 వరకు ఎలాంటి అనుమతి, డ్యూటీ నుంచి మినహాయింపు లేకుండానే విధులకు గైర్హాజర్ అయ్యారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి నివేదిక అందించారు. పరిశీలించిన యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి రూ.31,25,715 రికవరీ చేయాలని నిర్ణయంతోపాటు ఒక వార్షిక ఇంక్రిమెంట్ నిలిపివేస్తూ మెమో జారీ చేసింది. ఇందులో సెలవులు రూపేణ రూ.12,01,815 మినహాయించి మిగతా రూ.19,23,900ను సంబంధిత ఉద్యోగి పి.గోపాల్ రావుతో పాటు, విధులకు గైర్హాజరైన జీతం ఇచ్చినందుకు అప్పటి డీఈ నుంచి రికవరీ చేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇద్దరి నుంచి రూ.9,61,950 చొప్పున రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయించింది.

రైతులకు అండగా ఉంటాం..

- పంట నష్టపోయినవారికి పరిహారం అందిస్తాం..
- రాష్ట్ర మంత్రి సీతక్క



వరి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలోని అమృతండా, చంద్రు తండా లక్ష్మీపురం, కర్లపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంట పొలాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క పరిశీలించారు. పంట పొలాలను పరిశీలించిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ఫోన్ చేసి పంట నష్టాన్ని వివరించి పరిహారం ఇవ్వాలని సీతక్క కోరారు. దీనికి స్పందించిన నాగేశ్వరరావు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సీతక్క తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటి పాలైందని అన్నారు. వెంటనే నష్టతీవ్రతను అంచనా వేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని తెలిపారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, టీపీసీసీ సభ్యుడు మల్లాది రాంరెడ్డి, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇస్సార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్రెడ్డి

హన్మకొండ: రైతు సమస్యలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణ మాఫీ చేయడంలో విఫలమైందని విమర్శించారు. యాసంగి పంట కాలం పూర్తయి... వానా కాలం సాగు సమీపిస్తున్నా ఇప్పటికీ యాసంగి కాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి రూ.6 వేలు క్రమం తప్పకుండా ఇస్తోందని చెప్పిన ఆయన.. కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అనేక వాగ్దానాలు చేసి ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నదని విమర్శించారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎంత మందికి రుణ మాఫీ జరిగిందో తెలియజేస్తూ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు చేయడంతోపాటు రైతు భరోసా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీ ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, వరంగల్, జేఎస్భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, నిశిధర్ రెడ్డి, సిరికొండ బలరాం, సోడా రమేష్, నాయకులు వన్నాల శ్రీరాములు, రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్రావు, కుసుమ సతీష్, మల్లాడి తిరుపతిరెడ్డి, రత్నం సతీష్, గోగుల రాణాప్రతాపరెడ్డి, బైరి నాగరాజు, పుల్యాల రవీందర్ రెడ్డి, ఎం.విష్ణు, డాక్టర్ కాశీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కూల్డ్రింక్స్ విక్రయం

- సీజ్ చేసిన పోలీసులు





పోలీసులు సీజ్ చేసిన కూల్డ్రింక్స్

కమలాపూర్: కాలం చెల్లిన కూల్డ్రింక్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఓ కిరాణా షాపు యజమాని ఫిర్యాదుతో పోలీసులు ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి కాలం చెల్లిన పలు రకాల కూల్డ్రింక్స్ను సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కిరాణా షాపు యజమాని, కొనుగోలుదారులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలంలోని ఉప్పల్కు చెందిన కెంసారపు తిరుపతి అనే కిరాణా షాపు నిర్వాహకుడికి కమలాపూర్లోని కూల్డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకులు మౌటం ఓంప్రకాష్–హేమలత గత నెల 21న కొన్ని 200 ఎంఎల్ మజా బాటిళ్లు సరఫరా చేశారు. వాటిని తిరుపతి కొందరు కొనుగోలుదారులకు విక్రయించగా డేట్ ఎక్స్పైర్ అయినట్లుగా వారు గుర్తించారు. దీంతో కాలం చెల్లిన కూల్డ్రింక్స్ ఎందుకు విక్రయిస్తున్నావని, ఇవి తాగితే తమ ప్రాణాలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ తిరుపతిని కొనుగోలుదారులు నిలదీశారు. దీంతో తిరుపతి తాను ఎక్స్పైర్ డేట్ను గమనించలేదని చెప్పానే వెంటనే ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి కాలం చెల్లిన కూల్డ్రింక్స్ ఎందుకిచ్చారని, వాటిని తీసుకెళ్లి వాటి స్థానంలో వేరే కూల్డ్రింక్స్ ఇవ్వాలని కోరాడు. దీంతో వారు తమకేమీ సంబంధం లేదని, కంపెనీ వాళ్లకు వాపస్ ఇచ్చుకోండంటూ దురుసుగా మాట్లాడటమే కాకుండా నానా దుర్భాషలాడారని తిరుపతి ఆరోపించాడు. అంతే కాకుండా కంపెనీ వాళ్లు ఇచ్చిన ఫ్రిజ్ బయట పెడితే తీసుకెళ్తామని ఫోన్లోనే వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులు వేచి చూసిన తిరుపతి గత నెల 31న కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 2న పోలీసులు కమలాపూర్లోని కూల్డ్రింక్స్ ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి గోదాంలో నిల్వ ఉన్న కాలం చెల్లిన పలు రకాల కూల్డ్రింక్స్తోపాటు వాటర్, సోడా బాటిళ్లను సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. రూ.15,483 విలువైన కూల్డ్రింక్స్ సీజ్ చేసి, ఏజెన్సీ నిర్వాహకుడు ఓం ప్రకాశ్పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రారావు తెలిపారు. కాగా, కాలం చెల్లిన కూల్డ్రింక్స్ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, వారి అండదండలతోనే ఈ తతంగమంతా నడుస్తోందని, కాలం చెల్లిన కూల్డ్రింక్స్ సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడికి అరుదైన గుండె శస్త్రచికిత్స



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ షఫీ

కాజీపేట అర్బన్: హంటర్రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో 77 ఏళ్ల వృద్ధుడికి వైద్యులు అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను వైద్యుడు షఫీ వెల్లడించారు. వరంగల్కు చెందిన వృద్ధుడు మామిడిపల్లి ముకుందాచారి ఇటీవల తీవ్రమైన గుండె నొప్పితో ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్, రైట్ కరోనరీ ఆర్టరీ, లెఫ్ట్ సర్కమ్ ఫ్లెక్స్ ఆర్టరీ, యాంటీరియర్ డిసెండింగ్ ఆర్టరీ, స్టెనోసిస్గా గుర్తించినట్లు తెలిపారు. ఈక్రమంలో డ్రగ్ ఎలుటింగ్ స్టెంట్, డ్రగ్ ఎలుటింగ్ బలూన్ గుండె శస్త్రచికిత్స నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం వృద్ధుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు షఫీ వెల్లడించారు.

గిరిజనులపై చిన్న చూపు వీడండి

- సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

సాక్షి, మహబూబాబాద్ : గిరిజనులు అంటే ఇంకా సమాజంలో చిన్నచూపు ఉంది.. అధికారుల్లో కూడా అటువంటి ధోరణి ఉండటం సమంజసం కాదు.. చిన్న చూపు వీడి వారి అభ్యున్నతికి పాటుపడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలు, ఎస్టీలపై కేసులు మొదలైన అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పెద్ద అధికారుల వరకు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. భూ సమస్యలు పరిష్కరించకుండా సంవత్సరాల తరబడి గిరిజనులను తిప్పించుకుంటున్నారని అన్నారు. గిరిజన కాలనీల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నా.. వాటిని పరిష్కరించడం లేదని పలు సమస్యలను గుర్తు చేసి వినిపించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఐటీడీఏ పీడీ చిత్ర మిశ్రా, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు
- కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్బాబు, పక్కన ఎమ్మెల్యేలు, తదితరులు

పరకాల: ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్బాబు అన్నారు. టెక్స్టైల్ పార్కులో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్బాబు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి ఆదేశించారు. పరకాల మున్సిపల్ సమావేశమందిరంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్రెడ్డి అధ్యక్షతన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెగా టెక్స్టైల్ పార్క్లోని ఇండస్ట్రీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు స్కిల్ ట్రెనింగ్ సెంటర్ల ద్వారా స్థానికులకు నైపుణ్యం కల్పించి నియమించుకోవాలని సూచించారు. ఆర్అండ్బీ లే అవుట్లో పట్టాలిచ్చిన 863 మంది రైతులకు వారి అభ్యర్థన మేరకు 50 గజాల నుంచి 75 గజాలు అందించేందుకు టీజీఐఐసీ ద్వారా అదనంగా రెండు ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. తిరిగి లేఅవుట్ ప్లాట్లు చేసి రాజీవ్ గాంధీ టౌన్ షిప్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ జీడీపీ పథకం ద్వారా రూ.10.10 కోట్ల వ్యయంతో చేపట్టిన కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్స్, మంచినీటి సరఫరా, సంప్, పరిపాలన భవన నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయని, జూలై 2025 నాటికి పూర్తవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

గంజాయి, గుడుంబా నివారణకు చర్యలు

టెక్స్టైల్ పార్క్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఉందని అలాంటి కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే ప్రకాశ్రెడ్డి కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పరకాల నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్బాబు ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాల ద్వారా 51 బ్యాచ్లలో 1,717 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసుకున్న 82 మంది మహిళలకు మంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ పత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




మల్లేశ్ (ఫైల్)

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఆవుల మల్లేశ్(30) రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని మంగళ సీడ్స్లో పని చేస్తున్నాడు. ప్రతీ రోజు మాదిరిగానే గురువారం పనికి వెళ్లి ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ధర్మసాగర్కు తిరిగి వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ రోడ్డు సమీపంలో వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ తల, గొంతు, కుడికాలుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్కు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మల్లేశ్ భార్య ఆవుల మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కిషన్ తెలిపారు.

పిల్లిని తీసేందుకు వెళ్లి..

- బావిలో పడి వృద్ధుడి మృతి



యాదగిరి (ఫైల్)

నెక్కొండ: చేద బావిలో పడిన పిల్లిని తీసేందుకు వెళ్లి వృద్ధుడు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల యాదగిరి (59) తన కుమార్తె కిరాయికి ఉంటున్న ఇంట్లోని చేద బావిలో పిల్లి పడి మృతి చెందింది. ఈ విషయాన్ని తన తండ్రి యాదగిరి చెప్పడంతో పిల్లి కళేబరాన్ని తీసేందుకు బావిలో దిగుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తాడు జారీ బావిలో పడిపోయాడు. దీంతో నీట మునిగిన వృద్ధుడు యాదగిరి మృతిచెందాడు. యాదగిరి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో శాయంపేట యువకుడి మృతి



మణికంఠ(ఫైల్)

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బండారి మణికంఠ(19) బాసరలోని శ్రీవేదభారతి పాఠశాలలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మణికంఠ బాసరలోని శ్రీవేదభారతి పాఠశాలలో రెండు సంవత్సరాలుగా చదువుతున్నాడు. మణికంఠ విద్యుత్షాక్తో మృతి చెందాడని శుక్రవారం మధ్యాహ్నం బాసరలోని వేద పాఠశాల సిబ్బంది మణికంఠ తండ్రి బండారి రాజేందర్కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో రాజేందర్ ఒక్కసారిగా షాక్కు గురయ్యాడు. తన కుమారుడు మణికంఠను ఎవరో కావాలని హత్య చేసి విద్యుత్ షాక్గా చిత్రీకరిస్తున్నారని తన కుమారుడి మృతిపై అధికారులు దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని రాజేందర్ కోరారు.

సంస్కృతీ, సంప్రదాయాలను వెలుగులోకి తేవాలి

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



సమ్మయ్యను సన్మానించిన వేణు బృందం

దేవరుప్పుల : తెలంగాణ ప్రాంత సినీ ప్రముఖులు ఇక్కడి జీవన విధానాలతోపాటు సంస్కృతి సంప్రదాయాలను మరింత వెలుగులోకి తీసుకరావాలని పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్య సూచించారు. బలగం సినిమా దర్శకుడు ఎల్దండి వేణు నిర్మించబోయే ఎల్లమ్మ సినిమా లొకేషన్ కోసం శుక్రవారం పాలకుర్తి ప్రాంతం పరిశీలించిన అనంతరం అప్పిరెడ్డిపల్లెలో సమ్మయ్య స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా వేణు చిందు యక్షగాన కళాకారులతో నాటకాలు వేయించి, సెలక్షన్స్ నిర్వహించారు. సమ్మయ్యను సన్మానించి సినిమాలో భాగస్వామ్యులు కావాలని కోరగా..అంగీకరించారు. తిరుపతి బృందం, సుధాకర్, కళాకారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోరింగ్ తండా సమీపంలో దారుణహత్యకు గురైన దంతాలపల్లి ఎంజేపీ గురుకులం హెల్త్ సూపర్ వైజర్ తాటి పార్థసారథి హత్య కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పార్థసారథి హత్య జరిగిన రోజున అతడి సోదరి హేమవరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో మృతుడు పార్థసారథి భార్య స్వప్న, ఆమె ప్రియుడు వెంకటవిద్యాసాగర్ను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు విచారణలో భాగంగా ముగ్గురు నిందితులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం ఒప్పుకున్నారని తెలిపారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని గంగ హుస్సేన్ బస్తీకి చెందిన తెలగరి వినయ్ కుమార్, బోగ శివకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక గ్రామానికి చెందిన మోతుకూరి వంశీ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్కు తరలిస్తామని పేర్కొన్నారు. గతంలో పార్థసారథిని హత్య చేయాలని జరిగిన రెక్కీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజాఓమంగి మండలం జెడ్డంగి గ్రామానికి చెందిన కూసం లవరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో రూరల్, సీసీఎస్ సీఐలు సర్వయ్య, హత్తిరాం, రూరల్, కేసముద్రం ఎస్సైలు దీపిక, మురళీధర్ రాజు పాల్గొన్నారు.